
ప్రజాశక్తి
శుక్రవారం 29 మార్చి 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు




పోలింగ్ ఏర్పాట్లపై కసరత్తు ప్రారంభం

- 14 వేల మంది ఉద్యోగుల ఎంపికపై దృష్టి
- 1300 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాల విభజన
- విధుల కేటాయింపులో జంబ్లింగ్ విధానం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంది. పోలింగ్‌లో పాల్గొనే ఉద్యోగుల ఎంపిక ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల విభజనకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో 1884 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో కొన్ని కేంద్రాల్లో 1300 కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు 31 వరకు ఉన్నట్టు జిల్లా అధికారులు గుర్తించారు. ఈమేరకు 31 కేంద్రాలు అదనంగా ఏర్పాటుకు ఎన్నికల కమిషన్‌కు జిల్లా అధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. ఎన్నికల కమిషన్ అనుమతిస్తే జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 1915కి పెరిగే అవకాశం ఉంది.

మంగళగిరి నియోజకవర్గంలో ఈ తరహా పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఎక్కువ మంది ఓటర్లు ఉంటే పోలింగ్ ప్రక్రియ రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగే అవకాశం ఉండటంతో విభజనకు ప్రతిపాదనలు పంపారు. ఈమేరకు పోలింగ్ సిబ్బందిని ఎంపిక చేసే ప్రక్రియను జిల్లా అధికారులు చేపట్టారు. ఒక్కొకేంద్రంలో ఆరుగురు సిబ్బందితోపాటు 20 శాతం రిజర్వు సిబ్బందితో కలిపి మొత్తం 13900 మంది సిబ్బంది అవసరం అవుతారని అంచనా వేశారు. ఇప్పటి వరకు ఎంపిక చేసిన పోలింగ్ అధికారి, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఏప్రిల్ 15న శిక్షణ ఇవ్వాలని యోచిస్తున్నారు. వీరు దాదాపు 4600 మంది వరకు ఉంటారని అంచనా. ఈమేరకు ఉద్యోగుల జాబితాలను సిద్ధం చేశారు. ఇందుకు నోడల్ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారి వ్యవహరిస్తున్నారు. ఎన్నికల విధుల దూరంగా ఉండాలని కొంత మంది ఉద్యోగులు యోచిస్తున్నారు.

ఈసారి రాజకీయ వత్తిడి ఎక్కువగా ఉంటుందనే భావనలో ఉద్యోగులు ఉన్నారు. ఇందుకోసం విధుల నుంచి తప్పుకోవడం కోసం ఎన్నికల అధికార్లకు వినతిపత్రాలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో విధులు కేటాయించిన తరువాత కూడా గైర్హాజరైతే ఇబ్బంది లేకుండా ఉండేందుకు 20 శాతం రిజర్వు ఉద్యోగులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. సచివాలయాల్లో పనిచేసే ఎఎన్‌ఎంలు, మహిళా పోలీసులకు పోలింగ్ విధులు కాకుండా ఇతర బాధ్యతలు అప్పగించనున్నారు. ఎఎన్‌ఎంలు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద వైద్యశిబిరాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

పోలింగ్ సిబ్బందికి జంబ్లింగ్...

పోలింగ్ సిబ్బందికి కూడా ఎన్నికల విధుల కేటాయింపులో జంబ్లింగ్ విధానం అవలంభించనున్నారు. పోలింగ్ సిబ్బంది జన్మస్థలం, నివశించే ప్రాంతం ఉన్న నియోజకవర్గంలో వారికి ఎన్నికల విధులు కేటాయించరు. మరొక నియోజకవర్గంలో విధులు కేటాయిస్తారు. అయితే ఈ సారి ఒకే పార్లమెంటు పరిధిలో డ్యూటీలు కేటాయించడం వల్ల జిల్లా పరిధిలోనే తక్కువ దూరంలోనే ఎన్నికల విధులు నిర్వహించేందుకు వెసులుబాటు ఉంటుందంటున్నారు. గుంటూరులో నివాసం ఉండే వారికి మంగళగిరి, తెనాలి, పొన్నూరు, తాడికొండ నియోజకవర్గాలకు కేటాయించే అవకాశం ఉంది. ఆయా నియోజకవర్గాల వారికి గుంటూరులోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించనున్నారు. ఈ మేరకు ప్రతి ఉద్యోగి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.



బిజెపిలో ఓటమి భయం

- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-తాడేపల్లి

వామపక్ష ఉద్యమాల పోరాటాల గడ్డ మంగళగిరి నియోజకవర్గంలో ఇండియా వేదిక అభ్యర్థులకు వేసే ప్రతి ఓటు ఒక బుల్లెట్ లాంటిదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. గురువారం రాత్రి తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో సిపిఎం పట్టణ విస్తృత సమావేశం కె.కరుణాకరరావు అధ్యక్షతన నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజల కోసం జెండాలెత్తి ప్రజల కోసం ప్రాణాలిచ్చి అనేక మంది ప్రాణ త్యాగాలు చేసిన గడ్డ మంగళగిరి ప్రాంతం అని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని సిఎం స్థాయి వ్యక్తులను కూడా రాత్రికిరాత్రి అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారని మండిపడ్డారు. బిజెపికి ఓటమి భయం పట్టుకునే ఈ విధమైన దుర్మార్గాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని నిలబెడతామని ఎన్‌టిఆర్ స్థాపించిన టిడిపి నేడు ఢిల్లీ పాలకుల ముందు తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిందన్నారు. దేశంలో రైతు, కార్మిక పోరాటాలు క్యాంపెయిన్‌గా నడిపిస్తున్న సిపిఎంను చూసి మోడీ వెన్నులో వణుకు పుట్టిందని చెప్పారు. బిజెపి ఎదిరించ గల శక్తి ఎర్రజెండాకు మాత్రమే

▶ 2లో

పకడ్బందీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు



- 8న కుడికాల్వలకు నీటి విడుదలకు అవకాశం
- సరఫరాల లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు
- అధికారులతో సమీక్షలో గుంటూరు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - గుంటూరు

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, జూన్ నెలాఖరు వరకూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. తాగునీటి సరఫరాపై ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్, ఇంజినీరింగ్, పంచాయతీరాజ్ అధికారులతో కల్టెరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. సమ్మర్ స్టోరేజి ట్యాంకులన్నిటినీ పూర్తిగా నీటితో నింపాలని, తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించాలని చెప్పారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రతిరోజూ తాగునీటి సరఫరాను పరిశీలించాలన్నారు. సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితులను వారం ముందే గుర్తించి, నివారణకు సంబంధిత శాఖలకు సమాచారం అందించేలా పంచాయతీ, జిల్లా పరిషత్ అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. తాగునీటి ఎద్దడిగల గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా ప్రతిరోజూ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. బోర్‌వెల్స్ సహా ఇతర తాగునీటి వనరులకు అవసరమైన మరమ్మత్తులు నిర్వహించి అవన్నీ సమక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ ద్వారా తాగునీటి చెరువులకు ఎప్రిల్ 8వ తేదీన నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున కెనాల్ చివర ఉన్న గ్రామాల చెరువులు పూర్తి స్థాయిలో నింపుకునేలా ఇరిగేషన్, ఎన్‌ఎస్ కెనాల్,

▶ 2లో

శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ యజమానిపై చర్యలు కోసం

పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

2 లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం) : 6.25

సహారీ (శనివారం ఉదయం) : 4.48



బలసాని కిరణ్‌కుమార్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ : మండల కేంద్రమైన పెదనందిపాడులో వైసిపి మండల కన్వీనర్ షేక్ ఖాసింపీరా ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైపిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్‌కు వైసిపి శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ముస్లిముల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. తొలుత మసీదులు, ఆలయాలను సందర్శించారు. కార్యక్రమంలో వైసిపి సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ చెరుకూరి సాంబశివరావు, ఏబీ పాలెం సొసైటీ చైర్మన్ కూరేటి భూషయ్య, పెదనందిపాడు సర్పంచి దాసరి పద్మారావు, ఎంపిటిసి మాలతి, వైసిపి యువ నాయకులు షేక్ యాసిన్ పీరా, ఉప సర్పంచ్ దివి రాంబాబు. పలు గ్రామాల సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలిలో కూటమి అభ్యర్థుల రోడ్ షో

ప్రజాశక్తి - తెనాలి : టిడిపి, జనసేన, బిజెపి కూటమి గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గురువారం రోడ్ షో నిర్వహించారు. ఏడో వార్డు మాంటిస్సోరి స్కూల్ నుంచి 15వ వార్డు వరకు రోడ్డు షో జరిగింది. మధ్యాహ్నం స్థానిక నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ మండపంలో బీసీల ఆత్మీయ సమావేశంలోనూ వీరు పాల్గొన్నారు. కార్యక్రమంలో బిసి నాయకులు గిరి గణేష్, మాజీ జెడ్‌పిటిసి ఎ.జయలక్ష్మి, జె.రేణుక, పి.రమ్య, ఇ.వెంకట పూర్ణచంద్, టి.హరిప్రసాద్, జై మహేష్, హెచ్.గౌరీశంకర్, టీవీ రమణారావు పాల్గొన్నారు.

ఎన్‌డిఎ కూటమికి మద్దతుపై ఎంఆర్‌పిఎస్ పునరాలోచించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - మంగళగిరి : సార్వత్రిక ఎన్నికలలో ఎన్‌డిఎ కూటమికి ఎంఆర్‌పిఎస్ మద్దతివ్వటం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కంతేటి జీవన్ సాగర్ అభిప్రాయపడ్డారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దళితుల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారు? అని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలను ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. మణిపూర్ ఘటనలలో దళితులు, గిరిజనులను నగ్నంగా ఊరేగించినప్పుడు బీజేపీ ప్రభుత్వం కనీసం ఖండించలేదన్నారు. ఎంపీ నందిగం సురేష్ మాదిగల వద్ద వాసన వస్తుందని ఎవరు దగ్గరికి రానివ్వరని, ఒక జగన్మోహన్‌రెడ్డి మాత్రమే దళితులను ప్రేమిస్తాడని అనడం హాస్యాస్పదంగా ఉంటుందన్నారు. ఎమ్మార్పీఎస్ సోదరులు మరోసారి పునరాలోచన చేసి కాంగ్రెస్‌కు మద్దతుగా నిలబడాలని కోరారు.

పకడ్బందీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కెనాల్ ద్వారా వచ్చే నీటిని వథా కాకుండా సద్వినియోగం చేసుకోనేందుకు, పొలాల్లోకి నీరు వెళ్లకుండా అన్ని షెట్టర్లను ముందస్తుగా మూసివేయాలని చెప్పారు. నీరు అడ్డంకులు లేకుండా ప్రవహించేందుకు ఏప్రిల్ 5వ తేది నాటికి కెనాల్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థతో పాటు పొన్నూరు, తెనాలి మున్సిపాల్టీల్లో తాగునీటి సరఫరాపై నిరంతరం అప్రమత్తంగా ఉంటూ డిస్ట్రిబ్యూషన్ లైన్లను పరిశీలించాలన్నారు. పైపులైన్లు లేని ప్రాంతాలకు, శివారు, ఎక్స్‌టెన్షన్ ఏరియాలకు ట్యాంకుల ద్వారా సక్రమంగా నీటిని సరఫరా చేయాలన్నారు. తాగునీటి పథకాల మోటర్లకు విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర సరిహద్దు యంత్రాంగం సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్ రాష్ట్ర సరిహద్దు జిల్లాల యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని అంతరాష్ట్ర సరిహద్దు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల గుండా మద్యం, డబ్బు, ఆభరణాలు, మత్తు మందు వంటి వాటి సరఫరాను నిరోధించడంలో భాగంగా గురువారం తెలంగాణలోని నల్గొండ జిల్లా దామరచర్ల మండలం, వాడపల్లి వద్ద ఉన్న ఇండియన్ సిమెంట్స్ సమావేశ మందిరంలో అంతర్ రాష్ట్ర సరిహద్దు జిల్లాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. రెవిన్యూ, పోలీస్ ఇతర జిల్లా స్థాయి ఉన్నతాధికారులు హాజరైన ఈ సమావేశంలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకునేలా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయడమే కాకుండా, సమాచారం ఎప్పటికప్పుడు చేరవేయాలని, సమస్యలపై స్పందించి తక్షణ చర్యలు చేపట్టే విధంగా చూడాలని అన్నారు. నల్గొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ నల్గొండ-పలనాడు జిల్లాల అంతర్ రాష్ట్ర సరిహద్దులో 3 చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటిని నిరంతరం సీసీటీవీ కెమెరాలతో 24 గంటలు పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు నల్గొండ జిల్లాలో 4.5 కోట్ల నగదు, మద్యం, ఆభరణాలను సీజ్ చేశామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి మరిన్ని సీజర్లు పెరిగే అవకాశం ఉందన్నారు. చెక్‌పోస్టుల్లో సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా ఉండొవద్దని, ముఖ్యంగా కెనాల్ పాయింట్లు, నాగార్జునసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతంలో నిఘా ఎక్కువగా ఉంచాలని సూచించారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు సరఫరా కాకుండా చూడాలన్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు, నల్గొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి, సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, పల్నాడు ఎస్పీ రవిశంకర్ మాట్లాడుతూ మూడు జిల్లాల పోలీస్ యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఎలాంటి సమాచారమైన ఒకరికోకరు చేరవేసుకోవాలని, రహదారులపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులతోపాటు కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో నదిగుండా అక్రమంగా సరఫరా చేసే డబ్బు, మద్యం, వంటి వాటిని అరికట్టేందుకు సైతం చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం 3 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎక్సైజ్ , ట్రాన్స్పోర్ట్, సివిల్ సప్లై, ఇతర శాఖల అధికారులతో కలిసి వాడపల్లి వద్ద ఉన్న అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు.

గెలిస్తే డ్రైయిన్ల సమస్యలు పరిష్కరిస్తాం : మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



నగరంలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని టిడిపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి అన్నారు. నగరంలోని 22వ డివిజన్‌లో ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీనివాసపేట 60 అడుగుల రోడ్డు పీర్ల చావిడి సెంటర్ నుండి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ డివిజన్‌లో ప్రధానంగా సైడ్ డ్రెయిన్ల సమస్య అధికంగా ఉందని, దీనివల్ల మురునీరు పారే పరిస్థితి లేకపోవటంతో రోగాలు ప్రబలుతున్నాయని, తాను గెలిచిన వెంటనే ఈ డ్రెయిన్లన్ను, అసంపూర్తిగా మిగిలి ఉన్న రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తానని హామీనిచ్చారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న భావంతో టిడ్కో ఇళ్లను నిర్మిచారని, అధికారంలోకి వచ్చిన వైసిపి కక్షతో దానిని పాడుబెట్టారని, డిపాజిట్ కట్టిన లబ్ధిదారులను టిడిపి సానుభూతిపరుల పేరుతో తొలగించారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు ఎస్‌కె నాగూర్ వలి, చింతకాయల రామారావు, షరూపుద్దీన్, ఆర్.శ్రీనివాస్, ఎస్.కె మహమ్మద్‌గౌస్, షేక్ అబ్దుల్‌కరీం, ఎస్.కె.ఆదాం, చింతకాయల వెంకటసాయి, అబ్దుల్ జిలాని, నైజాంబాబు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్త పూర్ణచంద్రరావు మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి



తాడేపల్లిలో ప్రముఖ పారిశ్రామిక వేత్తగా పేరు గడించిన విన్నకోట పూర్ణచంద్రరావు (73) అనారోగ్యంతో బుధవారం రాత్రి తాడేపల్లిలోని ఆయన నివాసంలో మృతిచెందారు. పూర్ణచంద్రరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాడేపల్లిలో ప్రపథమంగా వ్యాపార రంగంలో రాణించిన వారిలో విన్నకోటను ప్రముఖంగా చెప్పుకుంటారు. పూర్ణచంద్రరావు భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాలసోమిరెడ్డి, మాజీ ఎంపిపి డి.వేమారెడ్డి, సిపిఎం సీనియర్ రాయకులు జొన్నా శివశంకరరావు, రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, సుందరయ్య సేవా సమితి కన్వీనర్ జి.సుబ్బారెడ్డి, మాజీ కౌన్సిలర్ కేళి వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు టి.నాగేశ్వరరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, ఎ.మురళీ, పుల్లారెడ్డి, పెంచలయ్య సందర్శించి నివాళుర్పించారు. గురువారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు తాడేపల్లిలో నిర్వహించారు.

పాలెపు రామారావుకు మాతృవియోగం

ప్రజాశక్తి-తాడేపల్లి



రామశేషమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు.. ఇన్‌సెట్‌లో రామశేషమ్మ (ఫైల్)

పెనుమాక టిడిపి సీనియర్ నాయకులు, సొసైటీ మాజీ అధ్యక్షులు పాలెపు రామారావు తల్లి పాలెపు రామశేషమ్మ (90) గురువారం ఉదయం మృతిచెందారు. శేషమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. టిడిపి ఆవిర్భావం నుండి రామారావు ఆ పార్టీలో కొనసాగుతున్నారు. శేషమ్మ మృతి విషయం తెలుసుకున్న మంగళగిరి టిడిపి సమన్వయకర్త నందం అబద్దయ్య, టిడిపి గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తాడేపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు అమరా సుబ్బారావు, కొల్లి శేషు, జంగాల సాంబశివరావు, కొమ్మారెడ్డి కిరణ్, రమేష్, పెనుమాక మాజీ సర్పంచ్ కె.అనంతశివారెడ్డి, గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు కళ్లం రాజశేఖరరెడ్డి, డి.జ్యోతిబసు, పఠాన్ ఖాసీంఖాన్, జానీఖాన్, అమరావతి రాజధాని జెఎసి అధ్యక్షులు పి.సుధాకర్, సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్‌కె పీరూసాహెబ్, సుందర్య సేవా సమితి కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, సిపిఐ నాయకులు గుంటక సాంబిరెడ్డి, ఉయ్యూరు శ్రీనుబాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు ఎం.శివారెడ్డి తదితరులు నివాళులర్పించారు. గురువారం సాయంత్రం పెనుమాకలోని శ్మశానవాటికలో శేషమ్మ అంత్యక్రియలు పూర్తి చేశారు.



వాహనాల తనిఖీలో కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-తాడేపల్లి

వైసిపి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు ప్రయాణిస్తున్న కారును జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎస్‌పి తుషార్ గురువారం తనిఖీలు నిర్వహించారు. కారు మొత్తం క్షుణ్ణంగా ఇద్దరు అధికారులు పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

కోల్డ్ స్టోరేజీలో దాచిన తమ పసుపు పంట మొత్తానికి బీమా చేయించలేదని, తాము పూర్తిగా మోసపోయామని రైతులు వాపోయారు. ఈ మేరకు మండల కేంద్రమైన దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ సోరేజీ యజమానిపై పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఒక్కో బస్తాకు రూ.200 చొప్పున బీమా ప్రీమియం వసూలు చేసి రసీదు ఇవ్వలేదని, పూర్తిస్థాయిలో బీమా చేసినట్లు నమ్మించారని చెప్పారు. జనవరి 19న కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పంట మొత్తం బూడిదైందని, తాము తీవ్రంగా నష్టపోయామని చెప్పారు. ప్రమాదం జరిగిన అనంతరం బీమా గురించి అడగగా అగ్ని ప్రమాదం జరిగిన రోజున ఉన్న ధరలో సగం ధరకు మాత్రమే బీమా చేశామని, క్లైమ్ వచ్చిన తర్వాత ఇస్తామని యజమాని చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు నమ్మక ద్రోహం చేసిన యజమానిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత రైతులకు న్యాయం చేయాలని విన్నవించారు. ఫిర్యాదు చేసిన వారిలో బాధిత రైతుల సంఘం కన్వీనర్ వి.వెంకటరామయ్య, నాదెండ్ల చంద్రశేఖరరావు, కె.సురేంద్ర, చిన్నరామిరెడ్డి,

బిజెపిలో ఓటమి భయం

(మొదటి పేజీ తరువాయి)

ఉందన్నారు. ప్రత్యేక హోదా అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన మోడీకి టిడిపి, జనసేన, వైసిపిలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రజల పక్షాన నిలిచే అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ నెల 30వ తేదీ సుందరయ్య నగర్‌లో మాలకొండారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలన్నారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ, నాయకులు డి.శ్రీనివాసకుమారి, వి.దుర్గారావు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలు

రెండు పూటలా నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - రెంటచింతల

అత్యధిక ఉష్ణోగ్రతకు పేరుగాంచిన రెంటచింతలలో రెండు పూటలా స్కూలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ- 2 శివ నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం 10వ తరగతి సంస్కృతం పరీక్ష ముగింపు సందర్భంగా స్కూల్ యాజమాన్యాలను హెచ్చరించారు. నాలుగు ప్రైవేటు పాఠశాలలో 740 మంది బాలబాలికలు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు పది పరీక్షలు ఉదయం 9:30 నుండి ప్రారంభమైన దృష్ట్యా మధ్యాహ్నం పాఠశాల నిర్వహించారని, శనివారం నుంచి ఉదయం పూటనే తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు

చింతలతాండలో గిరిజన ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

చింతలతాండ గ్రామంలో గిరిజన ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు పాల్గొన్నారు.ముందుగా విజయపురి సౌత్ గ్రామంలో మత్స్యకారుల కార్యకర్తలు,అభిమానులతో ముందుగా టి- జంక్షన్ వద్ద నుండి డాన్ మార్కెట్‌లో ఉన్నటువంటి ఆంజనేయస్వామి గుడి వద్దకు బైక్ ర్యాలీతో వచ్చారు. అనంతరం ముస్లిం పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి కొన్ని హామీలు ఇచ్చారు. ముస్లిం లకు టిడిపి అండగా ఉంటుందని, కొన్ని శక్తులు సోషల్ మీడియా ద్వారా లేనిపోని దుష్ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. అనంతరం షోలెం చర్చి వద్దకు వెళ్లారు. ఆ తర్వాత చింతల తండాలో ఏర్పాటు చేసిన గిరిజన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవ రాయలు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చింతలతాండలో తాగునీరు,రోడ్లు, కరెంట్ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. చదువుకున్న తమ పిల్లలు నిరుద్యోగులుగా మిగిలారని ఎంపీ ఎదుట కొందరు ఆవేదన వ్యక్తం చేయడం తో వారి వివరాలు అందజేస్తే తక్షణమే ఉపాధి కల్పిస్తానని చెప్పారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు, టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్ , కాపు జేఏసీ నాయకుడు పశువులేటి బ్రహ్మనాయుడు, కుర్రిశివారెడ్డి,యెనుమొల కేశవరెడ్డి, మురళి,గురువరెడ్డివజ్రం నాయక్,రాజబూన మధు, కుమార్,కంభంపాటి అనిల్,పులుసు శివరెడ్డి, ఉప్పలపాటి నరసయ్య,బండారు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లు ఇస్తానని చదలవాడ మభ్యపెట్టారు

- బుచ్చిపాపన్నపాలెంలో వందమందికి ఆ డబ్బు ఇస్తానన్నారు
- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తన బలం, బలగం తన స్వగ్రామం బుచ్చిపాపన్నపాలెం ప్రజలు అని, రొంపిచర్ల మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తనను ఆదరించారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇటీవల బుచ్చిపాపన్నపాలెంకి చెందిన 100 మందికి పైగా టిడిపిలో చేరారని డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రచారం చేసుకున్నారని, వారికి రూ.5 కోట్లు ఇస్తానని ఆయన మభ్యపెట్టారని ఎమ్మెల్యే ఆరోపించారు. చదలవాడ చెప్పిన ఆ వంద మంది వైసిపిలో కొనసాగుతున్నారని చెప్పారు.

తాను ఎమ్మెల్యే అయినా గ్రామానికి కొడుకేనని, కన్న ఊరు, కన్నతల్లి రుణం తీర్చుకోవడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. గ్రామానికి రూ 67 కోట్లతో అభివృద్ధి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-ఈపూరు



శ్రీనగర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎస్పీ వర్మ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గురువారం నరసరావుపేట డిఎస్పి ఏ వర్మ పరిశీలించారు. కొండ్రముట్ల,కొచ్చర్ల, శ్రీనగర్, అంగలూరు, బొమ్మరాజు పల్లి, ఇనిమెళ్ళ గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు వినుకొండ రూరల్ సిఐ యు. సుధాకర్, ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్ ఉన్నారు.

లక్కరాజుగార్లపాడు,పాకాలపాడులో కవాతు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహ కరిం చాలని సత్తెనపల్లి రూరల్ సిఐ ఎం రాజేష్ విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి మండలం లోని సమ స్యాత్మక గ్రామాల్లో సిఐ ఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు. లక్కరాజు గార్లపాడు, పాకాలపాడు గ్రామాల్లో సిఐ రాజేష్ ఆధ్వ ర్యంలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగ కుండా కేంద్ర బలగాలతో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో అల్లర్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



టైల్ పాండ్ ప్రాజెక్టు విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగులు గురువారం భోజన విరామ సమయంలో ప్రాజెక్టులో పరిపాలన భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ సంఘ నేతలు మాట్లాడుతూ బయోమెట్రిక్ కు ఉద్యోగుల జీతాలకు లింకు పెట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

ఇతర ఉద్యోగులకు విద్యుత్ ఉద్యోగుల బాధ్యతల నిర్వహణకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు అర్ధరాత్రి అపరాత్రి అనే తేడా లేకుండా విధులకు హాజరవుతామని పేర్కొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎస్ఈ వెంకటరమణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు వై వెంకటేశ్వర్లు సంయుక్త కార్యదర్శి ఎం మల్లేష్ కన్వనీరు కిరణ్ కుమార్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఈ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగస్తులు

వాటర్ ప్లాంట్ లో ట్యాంక్ క్లీన్ చేస్తూ

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక చెన్నకేశవ స్వామి దేవాలయం సమీపంలోని వాటర్ ప్లాంట్ లో వాటర్ ట్యాంక్ క్లీన్ చేస్తూ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వల్లెం శివ (40) విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. శివతో పాటు అతను పెంచుకుంటున్న కుమారుడు ప్లాంట్ యజమాని కలిసి పని చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. శివ, కుమారుని పక్కకు నెట్టేసి తాను మాత్రం తప్పించుకోలేకపోయాడు. శివ కుమారుడికి, ప్లాంట్ యజమానికి స్వల్ప గాయాలయ్యాయి. శివ సంఘటనా స్థలంలోనే చనిపోయాడు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం ప్రాంతానికి చెందిన శివ పదేళ్ల క్రితం మాచర్ల వచ్చి స్థిరపడ్డాడు. రూప్ లైన్ బోడు ఏడో వార్డులో నివాసం ఉంటున్నాడు. అతనికి వివాహం కాలేదు. ఒక పిల్లాడిని పెంచుకుంటున్నాడు.పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొడపాడు, ముసాపురంలో ప్రచారం

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని పొడపాడు, ముసాపురంలో టిడిపి ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించింది. అబివృద్ధి, పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఆయా గ్రామాల్లో పర్యటించారు. మండల టిడిపి నాయకులు రమేషు, ముంతాజు, స్థానిక నాయకులు మస్తాన్వలి, కాసరబాద హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,03,020
మిర్చి ఎగుమతి	: 1,12,869
మిర్చి నిల్వ	: 73,721

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 20,000
నెం.5	9,200 - 15,000
273	9,000 - 13,000
341	9,200 - 19,500
4884	9,200 - 17,500
సూపర్ 10	11,500 - 13,000
	నాన్ ఎసి
తేజ	8,000 - 21,000
బడిగి	9,000 - 20,000
దేవనూరు డీలక్స్	9,000 - 20,000
తాలుకాయలు	5,000 - 11,000



జన్మనిచ్చే అమ్మ కోసం..రక్తదానం

ప్రజాశక్తి - వినుకొండ

అభిల్ కలామ్ థెరిస్సా సేవా సొసైటి ఆధ్వర్యంలో వినుకొండ గవర్నమెంట్ హాస్పిటల్ లో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వినుకొండ పట్టణ సిఐ ఎస్. సాంబశివ రావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. సిఐ మాట్లాడుతూ అఖిల్ కలామ్ థెరిస్సా సేవా సంస్థ ఆధ్వర్యంలో జన్మ నిచ్చే అమ్మ కోసం రక్త దాన శిబిరం ఏర్పాటు చేసి. గవర్నమెంట్ హాస్పిటల్ లో ప్రసవించే నిరుపేద మహిళా మాతృమూర్తులు కోసం తలపెట్టిన ఈ కార్యక్రమం చాలా మంది తల్లులు కు ఉపయోగ పడుతుందని, సంస్థ సేవలను కొనియాడారు. సిఐ పిలుపు మేరకు,కాలేజీ విద్యార్థులు, యువతి, యువకులు పాల్గొని రక్త దానం చేశారు. డ్రైవర్స్, బిజినెస్ మెన్స్, ఉద్యోగులు 51 మంది రక్త దానం చేశారు. అనంతరం సంస్థ వ్యవ స్థాపకురాలు చందోలు నాగవాణి , వినుకొండ గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ షేక్ అబ్దుల్ రజయాక్ మాట్లాడారు.

బలహీన వర్గాల ఐక్యతను చాటాలి

ప్రజాశక్తి - వినుకొండ

బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా అవకాశాలు ఇచ్చి సామాజిక న్యాయం పాటించిన జగన్‌ని తిరిగి సిఎంను చేసేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని నరసరావుపేట పార్లమెంట్ వైసిపి అభ్యర్థి అనిల్ కుమార్ అన్నారు. శావల్యాపురం మండలంలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ కారుమంచిలో అభివృద్ధి సంక్షేమం జరిగి ఉంటే తమను ఆదరించాలని ప్రజలను కోరారు.

దళిత, మైనారిటీలకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

టిడిపి జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత మైనారిటీలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 30వ వార్డులో కన్నా లక్ష్మీనారాయణ గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి పాలనలో అడ్డగోలు నిబంధనలతో అర్హులకు సంక్షేమ పథకాలు దూరం చేశారని విమర్శించారు..



కేజ్రీవాల్ అరెస్టును ఖండించిన ఇండియా వేదిక

ప్రజాశక్తి - వినుకొండ

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ స్థానిక సిపిఐ కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా కార్యదర్శి ఆమ్ ఆద్మీ పార్టీ పులి మల రూబెన్ అధ్యక్షత వహించారు. ముందుగా భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ లకు ఘనమైన నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్డీ ఏలో చేరనందున కక్షగట్టారని, అందుకే అరవింద్ కేజ్రీవాల్ పై అక్రమంగా తప్పుడు కేసు బనాయించి అరెస్టు చేయడం అనాగరికమని అన్నారు. బిజెపి తమ జేబు సంస్థలుగా పని చేస్తున్న ఇడి, సిబిఐలతో ప్రతి పక్షపార్టీల నాయకులపై దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేసి ఎన్డిఎ కూటమిలో చేర్చుకుంటోందని విమర్శించారు. భయపడని వారిపై కేసులు పెట్టి జైలుకు పంపే కార్యక్రమాలు కొన సాగిస్తున్నారని అన్నారు. భారత బచావో కృష్ణ ,గుంటూరు జిల్లాల కార్యదర్శి కోలా నవజ్యోతి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని,భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ మతతత్వ వ్యతిరేక శక్తులన్నీ ఐక్యంగా మోడీని ఓడించాలని పిలుపు నిచ్చారు. పిడిఎం నాయకులు,రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు,ఎంఐఎం వినుకొండ పట్టణ అధ్యక్షుడు బాజీ ఎమ్మార్పీఎస్ నాయకులు పెట్టిపోయిన ప్రసన్నకుమార్, రాష్ట్ర గిరిజన సంఘ రాష్ట్ర నాయకులు కోట నాయక్ ఏపీసిఎల్సి నాయకులు పేరయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి భూదాల శ్రీని వాసరావు, సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర నాయకులు తోట ఆంజనేయులు ప్రసంగించారు.



సర్టిఫికెట్లు విద్యార్థులతో విద్యాసంస్థల కరస్పాండెంట్ తదితరులు

గీతమ్స్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక నరసరావుపేట రోడ్ లోని గంగినేని కళ్యాణ మండపంలో గీతమ్స విద్యాసంస్థల గ్రాడ్యుయేషన్ డే వేడు కలు ఘనంగా నిర్వహించారు. గీతమ్స విద్యాసంస్థల కరస్పాం డెంట్ మాలపాటి కోటిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖ అధి కారి సయ్యద్ జఫ్రూల్లా, అర్బన్ సిఐ సాంబశివరావు హాజ రయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. తల్లిదండ్రులు ప్రతి ఒక్క చిన్నారిని పాఠశాలల్లో చేర్పించి నిరక్షరాస్యతను దూరం చేసేలా పాటు పడాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అంద జేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మహిళా ఓటర్లే అధికం...

- జిల్లాలో మొత్తం 17,22,410 మంది ఓటర్లు
- పురుష ఓటర్లు 8,40,766, మహిళా ఓటర్లు 8,81,455
- వృద్ధులు, వికలాంగుల సౌలభ్యం కోసం ఇంటి నుండే ఓటు
- జిల్లాలో 20,138 మంది వృద్ధులు, వికలాంగ ఓటర్లు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులు, వయో వృద్ధులు ఇంటి నుండే ఓటు వేసే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. తొలిసారిగా అమల్లోకి తీసుకొచ్చిన ఈ విధానాన్ని 85 ఏళ్ల వయసు పైబడిన వయో వృద్ధులు, వికలాంగులు 1.73 శాతానికి పైగా వైకల్యం కలిగిన వారు వినియోగించుకో నున్నారు. అలాంటి వారు నామినేషన్ల నోటిఫికేషన్ జారీ అయిన 5 రోజుల్లోగా ఫారం- 12 డి నింపి నియోజకవర్గ ఎన్ని కల రిటర్నింగ్ అధి కారికి అందజేయాలి. దీంతో వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవ కాశాన్ని కల్పిస్తారు.

ఈ విధానంతో పోలింగ్ కేంద్రాల వద్ద కలిగే ఇబ్బందుల నుంచి వృద్ధులు, వికలాంగులకు ఉప శమనం లభించే అవకాశం ఉంది.జిల్లాలో మొత్తం 17,22,410 మంది ఓటర్లు ఉండగా అందులో 8,40,766 మంది పురుష ఓటర్లు, 8,81,455 మహిళా ఓటర్లు ఉన్నారు.వికలాంగ ఓటర్లు మొత్తం 20,138 మంది ఉండగా వీరిలో 11,980 మంది పురుషులు, 8,156 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్ ఓటర్లు ఇద్దరు ఉన్నారు. 9,884 మంది 85 ఏళ్లు దాటిన వృద్ధ ఓటర్లు ఉండగా, వీరిలో 3,784 మంది పురుష ఓటర్లు, 6,099 మంది వృద్ధ మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్ ఓటరు ఒకరు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా వికలాంగులు, 85 ఏళ్ల వయసు పై బడిన ఓటర్లు మొత్తం 30,022 మంది తమ ఓటును ఇంటి నుంచే వినియోగించుకునే అవకాశం ఉంది. గత ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద సరైన సౌకర్యాలు లేకపోవడంతో వికలాంగులు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. పోలింగ్ కేం ద్రానికి వెళ్లలేని పరిస్థితిలో ఓటును వినియోగించుకోలేకపోయేవారు. వారి ఇబ్బందులను గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం రానున్న ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ లక్ష్యంగా మొట్ట మొదటి సారి ఇంటి నుండే ఓటు వేసే విధానాన్ని ప్రవేశ పెట్టింది.

గోప్యంగానే ఓటు వినియోగించుకునే విధానం

ఇంటి నుండే ఓటు వేసే వారికోసం కేంద్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఫారం-12 డి దరఖాస్తు చేసుకున్న ఓటరు ఇంటికి బూత్ లెవల్ అధికారులు వెళ్లి బ్యాలెట్ బాక్స్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన చోట ఓటరు రహస్యంగా తన ఓటు వేసి బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. ఇద్దరు పోలింగ్ అధి.కారులు, పోలీసు అధికారితో పాటు ఒక వీడియో గ్రాఫర్ సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ విధానంలో ఓటు వినియోగించుకునే ప్రక్రియ మొత్తం వీడియో రికార్డు చేస్తారు. ఈ ప్రక్రియ ఎన్నికలకు ఒకరోజు ముందుగానే పూర్తి చేస్తారు.

ఫారం-12డి స్వీకరణ

సాధారణ ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటు వేయాలనుకునే 40 శాతం పైగా అంగవైకల్యం, వికలాంగులకు బూత్ లెవల్ అధికారులు ఫారం-12డిని అందజేస్తారు. ఫారం నింపి బూత్ లెవల్ అధికారులకు నోటిఫికేషన్ జారీ అయిన 5 రోజులలో అందజేయాలి. వాటిని అధికారులు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేస్తారు. వాటిని పరిశీలించి అర్హులైన వికలాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. వికలాంగులు, వృద్ధులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేస్తామంటే వారికి ఫారం -12 డి అవసరం లేదు. పోలింగ్ కేంద్రానికి వెళ్లవచ్చు.



ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు సహకరించండి

ఎన్నికల విధులు నిర్వహించే బృందాలతో నరసరావుపేట డీఎస్పీ వర్మ

ప్రజాశక్తి - వినుకొండ

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రజలు, రాజకీయ పార్టీలు పాటించి ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని నరసరావుపేట డిఎస్పి వర్మ కోరారు. వినుకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వహించే బృందాలతో గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం మీడి యాతో డిఎస్పి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలు అంశాలను క్షేత్ర స్థాయిలో పర్యటించే బృందాలు కీలక బాధ్యత వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. రాజకీయ పార్టీలు ప్రచారం, ప్రచురణల కోసం తప్పని సరిగా అనుమతులు పొందాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చెక్ పోస్టు వద్ద పోలీసు నిఘా పటిష్టం చేయ డం జరిగిందని, ప్రతిరోజు విధిగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.10 వేలు విలువకు మించి వస్తువులు తరలిస్తున్న, రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లే వారి వద్ద సరైన పత్రాలు లేక పోతే స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం నిల్వలు, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతులు, అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్ష సమావేశంలో ఆర్వో వరద సుబ్బా రావు, వినుకొండ టౌన్, రూరల్ సీఐలు సాంబశివరావు, సుధాకర్, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ ఇంచార్జీలు, ఎఇఒలు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మళ్లీ టిడిపిలోకి

ప్రజాశక్తి - మాచర్ల


స్థానిక పాత బజారులోని 11వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ తిరుమలకొండ అన సూయమ్మ, ఆమె భర్త ఇసుక ఆంజనేయులు, అతని వర్గీయులు పలు కుటుంబాలు, నర్సరావుపేట కూటమి ఉమ్మడి అభ్యర్థి శ్రీ కృష్ణదేవరాయులు సమక్షంలో వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. గతంలో టిడిపి కౌన్సిలర్‌గా గెలిచిన అంజి కుటుంబం ఇటీవల వైసిపిలో చేరారు. తిరిగి శ్రీకృష్ణదేవరాయులు, చిరుమామిళ్ళ మధుబాబు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. అంజి, అంజి కుటుంబ సభ్యులకు కండువా కప్పిన ఎంపి, వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణదేవ రాయులు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ప్రజలు జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీల కూటమి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఎన్‌డిఎ ఆధ్వర్యంలో అభివృద్ధి డబుల్ ఇంజన్ వేగంతో ఉంటుందన్నారు. తాను ఎంపిగా చేయదగిన పనులన్ని చేసినట్లు వివరించారు. కార్య క్రమంలో నాయకులు మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, కుర్రి శివారెడ్డి, కొమెర దుర్గారావు, సామినేని నర్సయ్య, అనంతరాములు, బండ్ల బ్రహ్మం పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయులు సమక్షంలో టిడిపిలో చేరిన మాజీ కౌన్సిలర్ తిరుమలకొండ అనసూయమ్మ

వినుకొండ చిత్రకారులకు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి - వినుకొండ : 'సేవ్ స్పరో' నినాదంతో విజయవాడ స్ఫూర్తి శ్రీనివాస్ ఈ నెల 23వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్ర కళా పోటీల్లో వినుకొండ సీనియర్ చిత్రకారులు వజ్రగిరి జెస్టిస్ వద్ద చిత్రకళా శిక్షణ పొందు తున్న విద్యార్థులు ఎం.కాత్యాయనికి సీనియర్ స్టూడెంట్స్ విభాగంలో రెండవ బహు మతి, జూనియర్ స్టూడెంట్స్ విభాగంలో మొదటి కన్సోలేషన్ బహుమతి జెస్టిస్ బ్యూలా దంపతుల కుమారుడు బెన్ జేసన్‌కు, జూనియర్ స్టూడెంట్స్ విభా గంలో ప్రత్యేక ప్రశంసాపత్రం ఆర్ చంద్రికకు లభించాయి.



సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నితిరుపతయ్య కోరారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతోన్మాద బిజెపి విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఇండియా వేదిక ఏర్పడిందని అన్నారు. ఈ వేదిక నుండి పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పదేళ్ల బిజెపి పాలనలో భారత రాజ్యాంగం ధ్వంసం చేసే విధంగా పరిపాలన సాగిందని విమర్శించారు. బిజెపి మళ్లీ గెలిస్తే దేశం అదోగతి పాలవుతుందని హెచ్చరించారు. సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రానికి బిజెపి తీవ్ర అన్యాయం చేసినా రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు మూడు బీజేపీ జపం చేస్తున్నాయని విమర్శించారు. ప్రత్యేక హోదా రాష్ట్రానికి ఇవ్వలేదని, విభజన హామీలను అమలపరచలేదని గుర్తు చేశారు. ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు పట్టించుకోవడంలేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే అసెంబ్లీకి, పార్లమెంట్లకు కార్మికవర్గ, రైతాంగ ప్రతినిధులు ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజా పోరాటాలను బయట నిర్వహిస్తూనే ప్రజా గళాన్ని చట్ట సభల్లో వినిపించే ప్రతినిధులను కూడా ప్రజలు ఎన్నుకోవాల్సిన అవసరం ఆసన్నమైందని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండియా వేదిక అభ్యర్థి ఉంటాడని, అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సమావేశంలో సిపిఐ నాయకులు జె.జాన్‌బాబు, సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, పి.బాలకృష్ణ, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, నాయకులు బాలాజీ, గణేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య

నేడు భీమిరెడ్డి సాంబిరెడ్డి 6వ వర్ధంతి సభ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం సీనియర్ నాయకులు, రైతు ఉద్యమ నేత భీమిరెడ్డి సాంబిరెడ్డి 6వ వర్ధంతి సభ కాజలోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని సిపిఎం నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, మంగళగిరి రూరల్ కార్యదర్శి మొసలి జ్యోతిబసు, జిల్లా కమిటీ సభ్యులు భీమిరెడ్డి కోటేశ్వరి హాజరుకానున్నారని పేర్కొన్నారు.


నూతన బ్రాంచీని ప్రారంభిస్తున్న రమణరావు

ఆర్టీసీ కాలనీలో సిజిజిబి బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక ఆర్‌టిసి కాలనీలో, భాష్యం స్కూల్ సమీపంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు 263 శాఖను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా బ్యాంకు జనరల్ మేనేజర్ డాక్టర్ బి.వి.రమణరావు పాల్గొని మాట్లాడుతూ ఖాతాదారులకు నిర్విరామంగా సేవలు అందిసూ, నూతన శాఖ వ్యాపార అభివృద్ధికి సరికొత్త బాటలు వేయాలని బ్రాంచ్ మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంకు ఎజిఎం, రీజనల్ మేనేజర్ పి.వీరారెడ్డి మాట్లాడుతూ మార్కెట్ పరిస్థితికి అతీతంగా సమాంజలో అన్ని వర్గాల కష్టమర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు డిపాజిట్లపై అత్యధికంగా 8.60 శాతం వడ్డీని అందిస్తున్నట్లు చెప్పారు. 8 జిల్లాల్లో 27 లక్షల మంది ఖాతాదారులతో రూ.22 వేల కోట్ల వ్యాపారం సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిజిజిబిఒఎ జనరల్ సెక్రెటరీ బి.శ్రీనివాసరావు, సిజిజిబి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ బి.సువర్ణరాజు, బ్రాంచ్ మేనేజర్ జి.తులసిరెడ్డి పాల్గొన్నారు.

పేదలు, నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమాశంకర్ తల్లి బద్రి నారాయణమ్మ పుట్టినరోజు సందర్భంగా పొన్నూరులోని పలు ప్రదేశాల్లోని నిరాశ్రయులు, పేదలకు అన్నదానం చేశారు. సంస్థ కార్యదర్శి జి.పవన్, సభ్యులు వి.సత్యనారాయణ, సింహాద్రి, టి.సూర్య, జాహ్నవి, మేఘనాథ్ పాల్గొన్నారు.

లావు బాల గంగాధరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు లావు బాలగంగాధరరావు 21వ వర్ధంతి సభ మండలంలోని పొనుగుపాడులో గురువారం జరిగింది. బాలగంగాధరరావు చిత్రపటానికి నాయకులు షేక్ ఖాజా మస్తాన్‌వలి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ ఎల్బీజీ గుంటూరు జిల్లాలోని క్రాప గ్రామంలో ప్రాథమిక విద్య అభ్యసించి, గుంటూరులోని ఏసీ కాలేజీలో ఇంటర్మీడియట్, డిగ్రీ చదివారని, చిన్నతనం నుండి రాజకీయాల వైపు మక్కువ చూపారని అన్నారు. విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగాను, కేంద్ర కమిటీ సభ్యులుగా పార్టీ అభ్యున్నతికి పాటుపడ్డారని, ప్రభుత్వ నిర్బధం వల్ల 11 ఏళ్లపాటు అజ్ఞాతవాసం చేశారని తెలిపారు. నేటి పాలకులు మత ద్వేషాలు రెచ్చగొడుతూ, ప్రజాస్వామ్యం, లౌకికత్వాన్ని, మన రాజ్యాంగానికి తూట్లు పొడు స్తున్న నేపథ్యంలో ఎల్బీజీ ఆశయాల కోసం కృషి చేయాలన్నారు. సభలో నాయకులు జి.వెంకటేశ్వరరావు, జి.రామకోటేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


లావు బాల గంగాధరరావు చిత్రపటానికి పూలమాలేస్తున్న నాయకులు

మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా బాలమురళీకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి బార్ అసోసియేషన్‌కు గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా శృంగారపాటి బాలమురళీకృష్ణ తన సమీప ప్రత్యర్థి వేమూరి రత్నప్రసాద్‌పై ఏడు ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా కుడారి శేఖర్‌బాబు తన సమీప అభ్యర్థి తోట నరసింహారావుపై మూడు ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శులుగా మాలపాటి సురేంద్రబాబు, రెంటపల్లి రాజేష్ ఇద్దరు పోటీ పడగా సమాన ఓట్లు రావడంతో చెరో ఆరు నెలలు పదవిలో కొనసాగున్నారు. సహాయ కార్యదర్శిగా డాక్టర్ తాతా సాంబశివరావు, ట్రెజరర్‌గా సూరబోయిన మురళీకృష్ణ, మహిళా సెక్రటరీగా వింజమూరి భారతీదేవి, లైబ్రరీ సెక్రటరీగా స్వరూపారాణి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా గుర్రం రామారావు, 15 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వాకా రామగోపాల్‌గౌడ్, గుజ్జర్లపూడి జాన్‌బాబు, కె.బాబు అంబేద్కర్, ఎమ్‌డి సౌకత్ హుస్సేన్, జొన్నాదుల లెనిన్‌బాబు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గం


సునీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

వర్సిటీ ఫొటోగ్రాఫర్ సునీల్‌కుమార్‌కు మరోసారి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫొటోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తున్న గుత్తా సునీల్ కుమార్‌ను అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించినందుకుగాను వీసీ పి.రాజశేఖర్ గురువారం సత్కరించారు. ఫ్రాన్స్ దేశానికి చెందిన ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ డీల్ ఆర్ట్ ఫొటోగ్రాఫిక్ సంస్థ గిరిజనుల జీవన శైలిపై సునీల్‌కుమార్ సమర్పించిన డాక్యుమెంటరీని పరిశీలించి ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డ్‌ను రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సునీల్ కుమార్ ఒక్కరే ఎంపిక కావడం గమనార్హం. గతేడాది బ్రిటీష్ రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ నుంచి అసోసియేట్ షిప్‌ను సునీల్‌కుమార్ పొందారు. అమెరికాలోని ఇమేజ్ కోవిగ్ సొసైటీ సంస్థ నుంచి మాస్టర్స్ అవార్డ్ పొందారు. సునీల్‌కుమార్‌ను అభినందించిన వారిలో రెక్టార్ పి.వరప్రసాద్‌మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి.అనిత, ప్రొఫెసర్ సంధ్యకోల్, ప్రొఫెసర్ ఉదయ కుమార్ ఉన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

శ్రీవిజేత హైస్కూల్లో ఘనంగా గెట్ టు గెదర్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఏటిగ్రహారంలోని శ్రీవిజేత హైస్కూల్లో గెట్ టుగెదర్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ చెరుకూరి శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ షేక్.రోషన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే, శ్రీ విజేత స్కూల్ మీకు అక్షర జ్ఞానం నేర్పించి బావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతుందని అన్నారు. కార్పొరేట్ స్థాయి స్కూళ్లకు దీటుగా శ్రీవిజేత స్కూల్ మంచి చదువు అందిస్తుందని, భవిష్యత్తులో బాగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అందుగుల సంతోష్, అచ్చాల వెంకటరెడ్డి, మాణిక్యాలరావు, షేక్.సుభాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పార్టీల, అభ్యర్థుల ఖర్చులన్నీ నమోదు చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - గుంటూరు

ఎన్నికల్లో రాజకీయపార్టీలు, అభ్యర్థుల ఖర్చులను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లు సరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు, అకౌంటింగ్ టీం అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్షించారు. అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లు ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీడియో సర్వేలెన్స్ తదితర టీంలను సమన్వయం చేసుకుంటూ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార ఖర్చులను నమోదు చేయాలన్నారు. నిర్దేశిత ఫార్మేట్‌లో నివేదికలను ప్రతిరోజూ రిటర్నింగ్ అధికారికి, జిల్లా స్థాయిలోని ఎక్స్‌పెండీచర్‌ను మానిటరింగ్ సెల్‌కు అందించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ధరల ప్రకారం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారంలో వినియోగించే అన్ని రకాల వస్తువులకు ఖర్చులను నమోదు చేయాలన్నారు. అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యటిస్తూ రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రతి ఖర్చునూ అకౌంటింగ్ టీం ద్వారా నమోదు చేయించాలన్నారు.

గ్రీవెన్స్ రీడ్రసెల్ కమిటీ సమావేశం

జిల్లా స్థాయి గ్రీవెన్స్ రీడ్రసెల్ కమిటీ (సీజర్స్) సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన తనిఖీల్లో సీజ్ చేసిన వస్తువులకు సంబంధించిన ఫిర్యాధులను కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమీక్షించి సూచనలు చేశారు. సమావేశాల్లో జిల్లా రెవెన్యూ అధికారి పి.రోజా, ఎక్స్‌పెండీచర్ కమిటీ నోడల్ అధికారి శివరామకృష్ణ, జిల్లా ఖజనా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజగోపాల్, గ్రీవెన్స్ రీడ్రసెల్ కమిటీ కన్వీనర్ హరిహరనాథ్, ఐటీ నోడల్ అధికారి రఘు, అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్లు, అకౌంటింగ్ టీం అధికారులు పాల్గొన్నారు.


వివరాలు అడుగుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి

రూ.10 లక్షలకు మించి నగదు పట్టుబడితే సీజ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

10క్షలకు మించి నగదు పట్టుబడితే సీజ్ చేస్తామని సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ హెచ్చరించారు. సత్తెనపల్లి తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ 10 లక్షల లోపు నగదు పట్టుబడితే వారం రోజుల్లో సంబంధిత పత్రాలు చూపితే నగదును తిరిగి ఇస్తామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు రెండు వందల మీటర్ల దూరంలో ఎన్నికల కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

'శ్రావణి'ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఆరోగ్యంపట్ల అశ్రద్ధ చేయకుండా సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో శ్రావణి హాస్పిటల్స్ ఆద్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఉచిత వైద్య పరీక్షలు అందిస్తున్నందుకు శ్రావణి హాస్పిటల్ యాజమాన్యానికి లక్ష్మీనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం డాక్టర్లను శాలువాతో సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కనుమూరి కోటేశ్వరరావు

'టిడిపికి మద్దతు తెలుపుతున్నాం'

ప్రజాశక్తి-నకరికల్లు

ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్ట్ పార్టీ మద్దతు తెలుపుతుందని పల్నాడు జిల్లా అధ్యక్షులు కనుమూరి కోటేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణలో, 58 మాదిగ ఉపకులాల అభివృద్ధికి కృషి చేస్తానని వాగ్దానం చేశారని చెప్పారు. ఈ నెల 30న గుంటూరులో జరగనున్న సమావేశంలో ఎమ్మార్పీఎస్ వాటి అనుబంధ సంస్థల కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మహాజన సోషల్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కనుమూరి సంసోన్, గంటా ఏలీషా, గుజ్జల పౌల్, మాణిక్యరావు, మణిరావు పాల్గొన్నారు

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో అందిస్తున్న వడ్డీ మాఫీని ప్రజలుసద్వినియోగం చేసుకొని పన్ను బకాయిలు రద్దు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ఎన్నో ప్రభుత్వం కార్యాలయాల్లో పన్ను బకాయులు భారీగా పేర్కొని ఉన్నాయని చెప్పారు. ఈ బకాయిలపై తాము ప్రత్యేక దృష్టి సారించి వడ్డీ మాఫీని ద్వారా మొండి బకాయిలు కట్టించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

అందులో భాగంగా పట్టణంలోని టెలికమ్ శాఖ 2010 నుండి ఆస్తి పన్ను 54 లక్షల 13 వేల 393 రూపాయలు బకాయి ఉం దని, పన్ను బకాయి కట్టేందుకు సిద్ధం కావడంతో వారికి వడ్డీ మాఫీ 30 లక్షల 99 వేల 570 రూపా యలు పోగా మిగిలిన 23 లక్షల 13 వేల 823 రూపా యల నగదు చెల్లించి, ఆస్తి పన్నును రద్దు చేసుకున్నట్లు చెప్పారు. పన్ను వసూళ్లపై తమ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి వసూళ్లను వేగవంతం చేయాలని అన్నారు.



వడ్డీ మాఫీ పత్రాన్ని అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ షమ్మీ

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - నరసరావుపేట

దోమల నివారణకు ప్రత్యేక ఫోగింగ్ డ్రైవ్ ను నరసరావుపేట మున్సిపల్ అధికారులు గురువారం ప్రారంభించారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడానికి కొత్తగా అధునాతనమైన ఫాగింగ్ మిషన్లను మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ కనకరావు, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఓలేటి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో 1 మెగా ఫాగింగ్ మిషన్, 6 హ్యాండ్ ఫాగింగ్ మిషన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రెండు లేదా మూడు రోజులకు ఒకసారి పట్టణంలోని 34 వార్డుల్లో పూర్తి స్థాయిలో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని అందుకు సంబంధించి ఒక షెడ్యూల్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాని టేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు



విజయపురిసౌత్‌లో టిడిపి లో చేరిన కార్యకర్తలతో శ్రీకృష్ణదేవరాయలు,మధుబాబు

సాగర్ మత్స్యకారుల కాలనీలను దత్తత తీసుకుంటున్నా

ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రకటన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురి సౌత్ లోని సాగర్ క్యాంపు, డౌన్ మార్కెట్ మత్స్యకారుల కాలనీలను దత్తత తీసుకుంటున్నట్లు నరసరావుపేట ఎంపి, పార్లమెంట్ టిడిపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రకటించారు. గురువారం మాచర్ల మండలం విజయపురిసౌత్, చింతల తండా గ్రామాల్లో ఆయన పర్యటించారు.స్థానికులు కాలనీ లో సమస్యలను ఎంపి దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం వైసిపికి చెందిన 50 మత్స్యకారుల, 40 గిరిజనుల కుటుంబాలు ఎంపి సమక్షంలో టిడిపిలో చేరారు. స్థానిక మసీదుకు చేరుకొని ముస్లిం మైనారిటీలతో సమావేశం నిర్వహించారు. టిడిపి ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం పలు సంఘాలతో మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు,టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్,రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, కాపు జెఎసి అధ్యక్షుడు పశువులేటి బ్రహ్మ నాయుడు, ఎస్సి సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు సాతులూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'వైసిపి పతనానికి వలసలే నిదర్శనం'

ప్రజాశక్తి - వినుకొండ



వినుకొండ సహా రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి నుంచి తెలుగు దేశంలోకి కొనసాగుతున్న వలసలే ఆ పార్టీ పత నానికి నాంది అని పల్నా డు జిల్లా టిడిపి అధ్యక్షుడు, కూటమి ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. ఎన్నికల నాటికి వైసిపికి మరింత డీలా పడటం ఖాయమని, వినుకొండ వైసిపిలో చివరికి బొల్లా బ్రహ్మనాయుడు ఒక్కరే మిగులుతారేమోనని ఎద్దేవా చేశారు. బొల్లా అవినీతి, అక్రమాలు భరించలేకే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛం దంగా తెలుగుదేశంలో చేరుతున్నా రని అన్నారు. గురువారం రాత్రి బొల్లాపల్లి మండలంలో పలు గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. గండి గనుములలో ఏకంగా 200 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. గండి గనుములలో జరిగిన కార్యక్రమంలో జీవీ ఆంజ నేయులు, ఎంపి లావు, మాజీ ఎమ్మెల్యే మక్కెన సమక్షంలో వారు టిడిపిలో చేరారు.



మున్సిపల్ కమిషనర్ రవికుమార్‌కి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తాగునీటి సమస్య తీర్చాలని పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ రవికుమార్‌కి స్థానిక 25వ వార్డు కు సంబంధించిన ముస్లిం మహిళలు 100 మంది తమ సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25వ వార్డులో ఎక్కువగా ముస్లింలు నివ సిస్తుంటారని, రంజాన్ నెల సందర్భంగా తాము ఉపవాసా లతో ఉంటామని చెప్పారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. ప్రతి ఇంటికి పైప్ లైన్ వేశారే తప్ప ఇప్పటి వరకు ఒక గంట సేపు కూడా నీరు వదల్లేదని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ జైనులబ్దిన్ పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎంసెట్ కోచింగ్

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా ఎంసెట్ షార్ట్ టర్మ్ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 70 మంది విద్యార్థులకు కోచింగ్ ఇస్తున్నారు. అందులో భాగంగా ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, సీనియర్ పాత్రి కేయులు రమేష్ చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. రమేష్ మాట్లాడుతూ ఈ కార్య క్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షులు జ్యోతిష్‌కుమార్, మండల అధ్యక్షుడు చైతన్య రాఘవ పాల్గొన్నారు.

31 లోపు వడ్డీ లేకుండా ఆస్తి పన్ను

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట పట్టణ పురపాలక సంఘానికి చెందిన ఆస్తి పన్నులు, ఖాళీ స్థల పన్నులు మరియు నీటి చార్జీలు ఈనెల 31 వ తారీకు లోపు వడ్డీ లేకుండా చెల్లించుకునే వెసులు బాటు కల్పించామని సంబంధిత మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియనున్న సందర్భంగా సెలవు దినాల్లో కూడా ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేసి పన్నులు చెల్లించే అవకాశం కల్పిస్తున్నామని, ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ నెల 31 లోపు సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, నీటి చార్జ్జులు చెల్లించాల్సిందిగా కోరారు.

మురుగునీటితో ప్రజలకు అవస్థ

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్



మురుగునీటి నిల్వలతో ప్రజలు బెంబేలు ఎత్తుతున్నారు . స్థానిక 7వ వార్డులోఒక భారీ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది . దీంతో బిల్డింగ్ నిర్మాణం కోసం అవసరమైన ఇసుక, కంకర పెద్ద పెద్ద లారీలతో ఆ ప్రాంతంలో దిగుమతి చేయడంతో మున్సిపాలిటి ఏర్పాటు చేసిన డ్రైనేజీ కాలువలు పూర్తిగా మూసుకుపోయి, మురుగునీరు ప్రవహించేందుకు అవకాశం లేకపోవడంతో లీకుల ద్వారా వస్తున్నా మురుగునీరు పల్లపు ప్రాంతం ఎక్కడుంటే అక్కడ చేరుతున్నాయి. దీంతో అ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు ఈ మురుగునీటి నుండి వ్యాప్తి చెందుతున్న దోమల కారణంగా అనేక ఇబ్బందులకు గురౌతున్నారు. ఇప్పటికే పట్టణంలో డెంగీ, మలేరియా లాంటి వ్యాధుల బారినపడ్డ రోగులతో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలాలు నిండిపోయాయి. మున్సిపల్ అధికారులు ప్రజారోగ్యానికి భద్రత కల్పించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవిఎంలో ఏ సమస్య వచ్చినా పరిష్కరించాలి



ప్రజాశక్తి - గుంటూరు

ఎన్నికల్లో ఇవిఎంల వినియోగంపై ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, అందుకు తగిన శిక్షణ అందిస్తామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి చెప్పారు. ఇవిఎంల నిర్వహణపై డెమో ఇవిఎంల ద్వారా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సెక్టోరల్, రూట్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు గురువారం శిక్షణిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్ల ద్వారా జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ అందిస్తామని తెలిపారు. ఎన్నికల రోజు ఇవిఎంల్లో ఏ సమస్య ఎదురైనా తక్షణం పరిష్కారించేలా శిక్షణ పొందాలని, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు కూడా తగిన శిక్షణ తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇవిఎంల పనితీరుతో పాటుగా ఎన్నికల నిర్వహణలో అవసరమయ్యే పిఒ డైరీ, 17సి, వివిధ రకాల ఫారాల గూర్చి సమగ్రంగా తెలుసుకోవాలని సూచించారు. సెక్టోరల్, రూట్ అధికారులకు క్షేత్ర స్థాయిలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, పోలింగ్ రోజు బ్యారీగేట్లను ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాటు చేస్తారని, పోలింగ్ కేంద్రం పరిధిలో ఓట్ల వివరాలపై బిఎల్ఓలు సహకరిస్తారని వివరించారు. ఎన్నికల సరళిలో చిన్నపొరపాటుకైనా తావివ్వొద్దని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శిక్షణలో ఉఆర్ఓలు సునీల్, భీమరాజు, సెక్టోరల్ అధికారి శ్రీధర్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, సెక్టోరల్, రూట్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిర్వహణపై ఎన్నికల విధుల సిబ్బందికి శిక్షణ

మద్రాస్ యూనివర్సిటీ ఉగాది వేడుకలకు ప్రజ్ఞాచారికి ఆహ్వానం



ప్రజాశక్తి-తెనాలి

మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నిర్వహించే శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలకు మండలంలోని కొలకలూరుకు చెందిన ప్రముఖ కవి, సాహితీరత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి ఆహ్వానం అందింది. ఏప్రిల్ ఐదున ఉదయం 10 గంటలకు మెరీనా ప్రాంగణంలో ఉగాది వేడుకలు జరుగుతాయని, ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయంలో నిర్వహించే వేడుకల సందర్భంగా కవి సమ్మేళనంలో పాల్గొనేందుకు తెలుగు కవులకు ఆహ్వానం లభించటం అరుదైన గౌరవంగా పూర్ణప్రజ్ఞాచారి చెప్పారు. కవి సమ్మేళనాన్ని ప్రముఖ సినీ గేయ రచయిత భువన చంద్ర ప్రారంభిస్తారని, నిడమర్తి వసుంధరాదేవి కవి సమ్మేళనం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మొత్తం 60 మంది కవులకు కవి సమ్మేళనంలో పాల్గొనేందుకు అవకాశం దక్కిందని తెలిపారు.

నానో టెక్నాలజీ డ్రగ్ డెలివరీపై ఫార్మసీ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాల విద్యార్థులకు నానో టెక్నాలజీ ఎన్హాన్స్ మెంట్ ఇన్ డ్రక్ డెలివరీ అనే అంశంపై అమెరికాలోని న్యూజెర్సీకి చెందిన ఎఎన్‌డిఎ ప్రోడక్ట్ డెవలపర్ బాదం సాయికుమార్ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో టెక్నాలజీలో ఆధునికంగా వస్తున్న మార్పులు, సాంకేతికత అభివృద్ధి, టెక్నిక్స్, అవి పని చేసే తీరును వివరించారు. ఔషధ పరిశ్రమలోని అంతర్భాగ వాతావరణ స్థితిగతులు, తన వృత్తి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అంతర్జాతీయంగా ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. తయారు చేసే ఔషధాలపై నిశిత పరిశీలన ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలరాణి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు నిత్య నూతన అంశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిష్ణాతులైన పరిశ్రమల నిర్వాహకులతో, అధ్యాపకులతో, వివిధ సంస్థల ప్రతినిధులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ కె.సుజన, డాక్టర్ కెఈ. ప్రవల్లిక, డాక్టర్ పి.రవి, డాక్టర్ ఎం.గాయత్రి రమ్య పాల్గొన్నారు.



బాదం సాయికుమార్‌ను సత్కరిస్తున్న ప్రొఫెసర్లు

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించండి


ప్రజాశక్తి - పొన్నూరు రూరల్



ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను అన్ని పార్టీల వారూ తప్పనిసరిగా పాటించాలని రిటర్నింగ్ ఆఫీసర్ లక్ష్మీకుమారి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎన్నికల ప్రచారం చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులకు శాశ్వత కీర్తి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్



నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులకు శాశ్వత పేరుప్రతిష్టలు దక్కుతాయని విశ్రాంత హెచ్ఎం కె.మంగనాథరావు అన్నారు. శ్రీరామ మున్సిపల్ హైస్కూల్లో 34 ఏళ్లపాటు ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేసి గురువారం ఉద్యోగ విరమణ చేసిన మహమ్మద్ ఖుషీద్ సన్మాన సభ నిర్వహించారు. సభకు శ్రీరామ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం కె.లాజర్‌బాబు అధ్యక్షత వహించారు. మహమ్మద్ ఖుర్షీద్ మాట్లాడుతూ తన ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఖుర్షిద్ దంపతులను ఉపాధ్యాయులు, బంధుమిత్రులు సత్కరించారు. ఎంఈఓలు ఆర్.శోభాచంద్, శ్రీనివాస్‌రెడ్డి, నేతాజీ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం పి.జయకుమార్, ఐదో వార్డు కొండముది రోడ్డు మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం వివి రాఘవరావు, విశ్రాంత హెచ్ఎం ఆర్థర్ ప్రసాద్, పి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో టిడ్కో ఇళ్లు నిర్వీర్యం

కూటమిని గెలిపిస్తే చెత్తపన్ను రద్దు చేస్తామన్న డాక్టర్ చంద్రశేఖర్, మనోహర్



ప్రజాశక్తి-తెనాలి

వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఐదు దశాబ్దాలు వెనక్కు మళ్లిందని, మరోసారి తప్పు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలని టిడిపి, జనసేన, బిజెపి కూటమి గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పన్నుల భారంతో విసిగి వేసారిపోయిన ప్రజలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటిగా చెత్తపన్ను రద్దు చేస్తామన్నారు. స్థానిక 'ఎ' కన్వెన్షన్ హాల్లో హోటల్స్ అండ్ ఫుడ్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు సూరపనేని నాగేశ్వరరావు, ఈదర వెంకట పూర్ణచంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తొలుత హోటల్స్, ఫుడ్ జంక్షన్లు, క్యాటరింగ్ విభాగం ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ చంద్రశేఖర్, మనోహర్ మాట్లాడుతూ చెత్తపన్ను వసూలు దారుణమన్నారు. అధికారంలోకి రాగానే చెత్తపన్నును తక్షణమే రద్దు చేస్తామన్నారు. ఇతర పన్నుల భారాన్ని పరిశీలించి, క్యాటగిరీలుగా విభజించి, వ్యాపారులకు భారం తగ్గిస్తామని చెప్పారు.

టిడ్కో ఇళ్లు నిర్వీర్యం..లబ్ధిదారులకు శాపం

పూలే కాలనీలో టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను డాక్టర్ చంద్రశేఖర్, మనోహర్ పరిశీలించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ జగన్ పేదల పక్షపాతి కాదని కక్షపాతని ఎద్దేవా చేశారు. కేవలం కక్షపూరిత దోరణితో టిడ్కో గృహనిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసి, లబ్ధిదారులకు దక్కకుండా చేసిందన్నారు. లబ్ధిదారుల వాటా కింద అప్పులు తెచ్చి చెల్లించారని, వారికి ప్రభుత్వం ఏమి సమాదానం చెబుతుందని ప్రశ్నించారు. చేసిన అప్పుకు వడ్డీ కట్టలేక, మరోవైపు బ్యాంకు నుంచి అందించిన రుణసౌకర్యానికి తాకీదులు వస్తుంటే పేదలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. లబ్ధిదారులపై రుణభారం, అప్పుల భారం పెరిగిందన్నారు. మనోహర్ మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో పేదలకోసం నిర్మించిన గృహ సముదాయాలను నాశనం చేసి, వైసిపి ప్రభుత్వం పైశాచికానందం పొందుతుందన్నారు. నిర్మాణాలను కూల్చటం తప్ప, కొత్త నిర్మాణాలు చేపట్టే సంస్కృతి వైసిపికి దూరమన్నారు. విధ్వంశాలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమాల్లో నాయకులు ఎ.జయలక్ష్మి, వి.మురళి, హెచ్.గౌరీశంకర్, జె.రెణుక, కె.నాగభూషణం, షేక్ కాలేషా పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా టిడిపి పార్లమెంటరీ కార్యాలయాన్ని స్థానిక కొత్తపేటలో నాదెండ్ల మనోహర్‌తో కలిసి చంద్రశేఖర్ ప్రారంభించారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తెనాలి సబ్ కలెక్టర్

పోలింగ్ కేంద్రాల్లో సబ్ కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని వల్లభాపురం, దావులూరుపాలెం, దావులూరు, గుదిబండివారిపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ గురువారం పరిశీలించారు. మౌలిక వసతులు లైట్లు, ఫ్యాన్లు, సీసీ కెమెరాల నిర్వహణకు విద్యుత్ కనెక్షన్‌ను పరిశీలించారు పోలింగ్ కేంద్రానికి కావాల్సిన ఫర్నిచర్, తాగునీటి వసతి, టాయిలెట్ సౌకర్యాలను గురించి సెక్టార్ అధికారులకు పలు సూచనలు చేశారు. తహశీల్దార్ ఎం.శ్రీనివాసులు, ఎంపిడిఒ బివై విష్ణు ప్రసాద్, ఎస్ఐ ఆర్.రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

గుంటూరుకు తిరిగి రానున్న 100 ఇవిఎంలు

ప్రజాశక్తి - గుంటూరు

ఎన్నికల సంఘం గుంటూరు నగరపాలక సంస్థకు కేటాయించిన ఇవిఎంల్లో కొన్నింటిని గతేడాది పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఇచ్చామని, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరుకు అవసరమున్నందున వాటిని తిరిగి ఆయా జిల్లా అధికారులు శనివారం అందించనున్నారని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది మేలో రాష్ట్ర ఎన్నికల సంఘం, గుంటూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుమతితో ఇవిఎంల్లో 100 పర్చూరు మండలానికి అక్కడ జెడ్‌పిటిసి ఎన్నికల అవసరాల కోసం ఇచ్చామని తెలిపారు. కేటాయించిన 100 ఇవిఎంలు వారికి ప్రస్తుతం అవసరం లేనందున వాటిని తిరిగి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇవ్వడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం అమోదించిన దృష్ట్యా వాటిని శనివారం గుంటూరు మున్సిపల్ పరిధిలో గల ఇవిఎంల గోడౌన్ నందు భద్రపరుచుటకు గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సెలవు రోజుల్లోనూ విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

ప్రజాశక్తి - తెనాలి రూరల్

సెలవు రోజులైన గురువారం, ఆదివారం కూడా వినియోగదారుల విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చని ఎపిసిపిడిసియల్ ఆపరేషన్ డివిజన్ తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి చిరంజీవి గురువారం ప్రకటనలో తెలిపారు. బిల్లులు విద్యుత్, రెవెన్యూ కార్యాలయాల వద్ద చెల్లించవచ్చని, ఆన్‌లైన్ ద్వారా అయితే www.apcpd-cl.in ద్వారా కూడా చెల్లించవచ్చని పేర్కొన్నారు.

అంబటి రాయుడు తండ్రిని కలిసిన నరేంద్ర

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్



ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు చిన్న కూమార్తె అన్నప్రాసన కార్యక్రమం మండలంలోని వెల్లలూరులో గురువారం జరిగింది. ఈ సందర్భంగా రాయుడు తండ్రి సాంబశివరావను టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డి.నరేంద్రకుమార్ కలిశారు. ఈ సందర్భంగా పరస్పరం సత్కరించుకున్నారు. కార్యక్రమంలో అంబటి సీతారామారావు, ఎ.శ్రీను (డాబా), ఎ.శ్రీనివాసరావు, సూదావసంత్, జి.రామకృష్ణ, ఢిల్లీబాబు, బుచ్చిబాబు పాల్గొన్నారు.



పట్టణంలో సాగుతున్న ర్యాలీ.. ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ (ఇన్‌సెట్)

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఓటు వేయండి

పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ - మాచర్లలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఓటు హక్కు వినియోగం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. ఓటర్లను చైతన్యం చేసేందుకు ఓటర్ల చైతన్య రథంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన రహదారుల గుండా సాగర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లి తిరిగి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. ఓటు హక్కు వినియోగించుకుందామని, ప్రజాస్వామ్యాన్ని నిలబెడదామని, ధృడమైన ప్రజా స్వామ్యం కోసం అందరూ ఓటు హక్కు వినియోగించుకుందామనే నినాదాలతో ర్యాలీ సాగింది. మాచర్ల అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దన్నారు. సమాజ శ్రేయస్సును ఆలోచన చేసి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.మంజునాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ డి.వెంకటదాసు, ఎంపిడిఓ సరోజినమ్మ, ఎన్‌సిసి క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంవిఎస్‌కె స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక 41వ డివిజన్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లోని ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్ 8వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ విద్యాపరమైన అంశాలపై డ్రామా, స్కిట్, నృత్య రూపకాల ద్వారా చేసిన ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. తొలుత నిర్వహించిన సభలో స్కూల్ కమిటీ ప్రెసిడెంట్ అయిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు ఆశయం ద్వారా ఈ స్కూల్ ఏర్పడిందన్నారు. ఆ తర్వాత అనేక మంది ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఈ ప్రాంతంలోని పేద పిల్లలకు నామమాత్రపు ఫీజుతో అత్యంత నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆధునిక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శిల్పా సింధూర, డాక్టర్ ప్రత్యూష వీర్నాల పాల్గొని పేద విద్యార్థుల కోసం సేవా దృక్పథంతో పాఠశాల నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా పదో తరగతి టాపర్ అమృత, 9వ తరగతి టాపర్ భాగ్యలక్ష్మికి ప్రోత్సాహక బహుమతులుగా రూ.10 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమానికి ఎన్.తాండవకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్కూల్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.ఉపేంద్ర, ఇండియన్ బ్యాంకు రిటైర్డ్ జిఎం సోమయాజులు, పలువురు రిటైర్డ్ అధికారులు, మానవతా సంస్థ నుండి పావులూరి రమేష్, స్కూల్ అడ్మినిస్ట్రేటర్ ఎల్.ఎస్.భారవి, టి.వినోద, వైస్‌ప్రిన్సిపాల్ దివ్య పాల్గొన్నారు.



బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ అవార్డులు అందుకున్న విద్యార్థులతో కెఎస్ లక్ష్మణరావు, తదితరులు



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇంటర్ ఉద్యోగి సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్ విద్యాశాఖలో లైబ్రేరియన్‌గా పనిచేస్తూ, డిప్యూటేషన్‌పై గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే ముస్తఫా వద్ద పిఎగా పనిచేస్తున్న మస్తాన్‌వలిని ఇంటర్ అధికారులు సస్పెండ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ప్రస్తుత వైసిపి గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నూరి ఫాతిమా తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనటంతో కలెక్టర్ ఆదేశాలతో ఇంటర్ అధికారులు మస్తాన్ వలిపై చర్యలు తీసుకున్నారు. ఉన్నతాధికారులకు, ఎన్నికల కమిషన్‌కూ నివేదిక పంపించినట్లు అధికారులు తెలిపారు.

సహిత విద్యపై సమగ్రశిక్ష అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్లు

గుంటూరు జిల్లా, సమగ్రశిక్ష, సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని జిల్లా సహిత విద్య వనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు గురువారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. బాల బాలికలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల స్థాయిలో తీసుకోవాల్సిన వివిధ రకాల చర్యలు, పదో తరగతి చదువుతూ సిడబ్ల్యూషన్ విద్యార్థులకు ఎస్ఎస్‌సి బోర్డు కల్పిస్తున్న సౌకర్యాలు, బాల బాలికలకు హోంబేస్డ్ సేవలు, ఒకేషనల్ ట్రైనింగ్, ఉచిత ఉపకరణాల పంపిణీ, చిన్న శస్త్ర చికిత్సలకు సంబంధించి అవగాహన కల్పించారు. సిడిపిఒలకు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు, ఇసిసిఇ వారు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, స్టేట్ అసిస్టెంట్ ఐఈ కో-ఆర్డినేటర్ వనజ, జిల్లా సహిత విద్య విభాగం సమన్వయకర్త శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

1వ తేదీ నుండి పది మూల్యాంకనం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. సహకరించిన అన్ని శాఖల అధికారులకు డిఇఒ కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి 10వ తరగతి మూల్యాంకనం కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మూల్యాంకనం విధులకు ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు అందర్నీ రిలీవ్ చేసి పంపించాలని హెచ్‌ఎంలను కోరారు.

ఆర్‌విఆర్ జెసి అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు



ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చేగూడి రంగారావుకు తమిళనాడు, చిదంబరం, అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రంగారావు 'పవర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ మైక్రోగ్రిడ్ త్రూ ఆప్టిమల్ కంట్రోల్ ఆఫ్ రెన్యుబుల్ ఎనర్జీ సోర్సెస్' అనే అంశంపై అన్నామలై యూనివర్సిటీకి చెందిన డాక్టర్ ఆర్.బాలమురుగన్, ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యాపకులు డాక్టర్ రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా రంగారావుకు కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు.

పాఠశాల కోసం ప్రయత్నం

- రెండేళ్ల కిందట మూతబడ్డ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎలిమెంటరీ స్కూల్
- అస్తవ్యస్తమైన చిన్నారుల చదువులు - కొందరు బడికి స్వస్తి
- పున: ప్రారంభించాలని, లేదా కొత్త పాఠశాల నిర్మించాలని స్థానికుల డిమాండ్

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు మున్సిపాల్టీ పరిధిలోని నిడుబ్రోలు క్యాబిన్‌పేటలోని రెండేళ్ల కిందట మూసేసిన ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను పున:ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూలు పేరుతో ఈ పాఠశాలను 1979లో అప్పటి మేనేజర్ కంచర్ల భాస్కరరావు ఏర్పాటు చేశారు. సుమారు 150 మంది 1-5 తరగతుల విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు పని చేయగా ఇక్కడ చదివిన ఎంతోమంది ఉన్నత ఉద్యోగాల్లో పనిచేస్తున్నారు. అయితే ఇద్దరు ఉపాధ్యాయులు రిటైర్ అవ్వగా వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదు. పైగా 2021-22 విద్యా సంవత్సరంలో ఇక్కడున్న ఏకైక ఉపాధ్యాయుణ్ణి మరొక పాఠశాలకు బదిలీ చేశారు. దీంతో అప్పటికే ఈ పాఠశాలలో 80 మంది విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారు. అయినా పాఠశాలను అర్ధాంతరంగా మూసివేయడంతో ఇక్కడి విద్యార్థులను కొండముది ఐదో వార్డు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలు, రైలుపేట ఆదికుమార్ మెమోరియల్ ఎలిమెంటరీ స్కూలుకు తరలించారు. అయితే చిన్నారులు ఆయా పాఠశాలలకు వెళ్లాలంటే రైలు పట్టాలను దాటి రావాల్సి వెళ్లడం, మరికొందరు దూరాబారం వెళ్లాల్సి రవడంతో కొంతమంది విద్యార్థులను తల్లిదండ్రులు చదువు మాన్పించారు. ఆవుల నాగేంద్రం కొడుకు ఇస్రాయిల్ రెండో తరగతి చదువుతున్న తన కుమారుడు ఆవుల ఇశ్రాయేలును దూరంలో ఉన్న పాఠశాలకు పంపించటం ఇష్టం లేక చదువు మాన్పించారు. ఇదే విధంగా మరికొందరు చేయగా ఆర్థిక స్తోమత ఉన్నవారు దగ్గర్లోని ప్రైవేటు స్కూళ్లలో చేర్పించారు. పేదరికంలో మగ్గుతున్న వారు తమ పిల్లల చదువులే మాన్పించారు. అయితే ఈ పరిస్థితిలో మార్పు కోసం స్థానికులు ప్రయత్నిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో తమ ప్రాంతంలోని పాఠశాలను పున:ప్రారంభించాలని, లేదా కొత్త పాఠశాలనైనా ప్రభుత్వం నిర్మించాలని కోరుతున్నారు. ఇందుకుగాను ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించాలని సిద్ధమవుతున్నారు.



నార్త్ క్యాబిన్ పేటలో మూతబడిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్ భవనం